క్లుప్తంగా

పత్ర కషాయంతో మేలు



పత్ర కషాయంపై అవగాహన కల్పిస్తున్న క్లస్టర్ మండల యాంకర్

తెర్లాం: రైతులు ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్న వరి, మొక్కజొన్న తదితర పంటలకు పలు పత్రాలతో తయారు చేసిన కషాయం వినియోగించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండలంలోని అరసబలగ గ్రామంలో పత్రాలతో కషాయం తయారు చేయడంపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఎంటీ సన్యాసినాయుడు, ఎస్‌ఎఫ్‌ఏ రేఖ పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో తొమ్మిది పనులు మంజూరు

బాడంగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.60లక్షలతో ప్రధాన రహదారులనుంచి గ్రామాన్ని కలిపే సీసీ.డబ్ల్యూబీఎం రోడ్లు, సీసీ కాల్వలను మండలానికి కలెక్టర్ నాగలక్ష్మి మంజూరు చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు గురువారం తెలిపారు. వీటిలో ఆరు గ్రామాలకు చెందిన తొమ్మిది సీసీ రోడ్లు, సీసీ కాల్వలు, డబ్ల్యూబీఎం రోడ్డు ఉన్నాయన్నారు.

పాఠశాలలకు క్రీడా పరికరాల కిట్ల పంపిణీ



క్రీడా పరికరాల కిట్లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని 66 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాల కిట్లను ఎంఈఓ త్రినాధరావు గురువారం పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా మండలంలోని అన్ని పాఠశాలలకు క్రీడా పరికరాల కిట్లను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రాథమిక పాఠశాల నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల వరకు ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా పరికరాలను ఆయా పాఠశాలలకు తరలించి హెచ్‌ఎంలకు అందజేశామని చెప్పారు. క్రీడా పరికరాలను విద్యార్థులకు అవసరమైన విధంగా ఉపయోగించాలని ఎంఈఓ సూచించారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు ఉన్నారు.

రక్తహీనత నివారణే ప్రభుత్వ ధ్యేయం



పాతరేగలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

రామభద్రపురం: రక్తహీనత నివారణే ప్రభుత్వం ధ్యేయమని తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎంపీడీఓ రమామణి అన్నారు. మండలంలోని పాతరేగలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు చిరు ధాన్యాలతో తయారుచేసిన వంటకాలు, ఆకు కూరలు, కాయగూరలను ప్రదర్శించారు. ఈ పౌష్టిహార ప్రదర్శనను తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎంపీడీఓ రమామణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి అపర్ణ పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉండాలి..

రేగిడి: కార్మికులంతా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోగలమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. మండలంలోని సంకిలిలో గల ఈఐడీ ప్యారీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద 2014లో యూనియన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యూనియన్ ఏర్పాటు నుంచి కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సతీష్, శ్రీనివాసరావు, నాయుడు, రాంబాబు, సురేష్, దాలినాయుడుపాల్గొన్నారు.

దంత సమస్యలపై దృష్టి సారించాలి

రాజాం సిటీ: విద్యార్థులు దంత సమస్యలుపై దృష్టి సారించాలని, పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ వైద్యులు వంశీనాయుడు, నరేంద్ర అన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో హెల్త్ ఈజ్ వెల్త్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దంత తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

బొబ్బిలి: పట్టణంలోని గాంధీ బొమ్మ దరి తన నివాసం వద్ద పూలు కోస్తున్న గూడెపువలస సింహాచలం అనే మహిళ మెడలో ఓ అగంతకుడు బంగారం తాడు తెంచుకు పోయినట్టు ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ గురువారం తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం వల్ల పేదలందరికీ ఇళ్ల వద్దే వైద్యం అందుతోంది. అలాగే ఇళ్లకే పరిమితమైన వారికి కూడా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వాడవాడలా గురువారం వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలందించారు.

– బొబ్బిలి/ రాజాం నెట్‌వర్క్



రాజాం: పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు.



రాజాం సిటీ: పాగిరిలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రేగిడి : కొమెరలో జగనన్న ఆరోగ్య సురక్షలో మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, వైస్ ఎంపీపీలు



వంగర: కోనంగిపాడులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు.



సంతకవిటి: సిరిపురంలో మందుల కిట్ బ్యాగ్‌ను అందిస్తున్న సర్పంచ్ తిరుపతి, ఎంపీడీఓ రవికుమార్



రామభద్రపురం: పాతరేగలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి



బాడంగి: రేజేరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు



తెర్లాం: సుందరాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట



మెగా పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

● ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుసంవర్ధక శాఖ సహకారంతో గరివిడి పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నాయుడువలస గ్రామంలో నిర్వహించిన మెగా పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరం వద్ద వైద్య కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించి, పలువురు రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ క్రమంలో గరివిడి పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పశువుల్లో పునరుత్పత్తి, ఫలదీకరణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరం ద్వారా 227 పశువులకు వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు, పునరుత్పత్తి పరీక్షలు చేశారు. 400 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడిరైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూగ జీవాలకు అత్యవసర వైద్య కోసం అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారన్నారు. జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ నడిమింటి లక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పశుసంవర్ధక శాఖ డీడీ నీలయ్య, ఏడీ ఎల్.విష్ణు, పశువైద్యాధికారులు హారణ్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



ప్రకృతి వ్యవసాయంపై రైతులతో మాట్లాడుతున్న డీపీఎం ఆనందరావు

● ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు

తెర్లాం: రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయడం, పంటలకు పలు రకాల పత్ర కషాయాలు తయారు చేసి వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని నందిగాం, అరసబలగ, పూనువలస గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసే పంటలను పరిశీలించారు. అనంతరం పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. రైతులంతా ఎక్కువగా ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలని, పంటలకు పురుగు మందులు కాకుండా, పలు పత్రాలతో తయారు చేసిన కషాయాలను వాడాలని సూచించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు

బాడంగి: కంటి చూపు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాడంగి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.సత్యనారాయణ అన్నారు. పాఠశాలలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి ప్రాధాన్యం గురించి వివరించారు. విద్యార్థి దశ నుంచే మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఈశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులు, దృష్టి లోపం ఉన్న వారికి ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు, కళ్లద్దాలు, ఉచిత శస్త్రచికిత్సలు చేయిస్తోందని చెప్పారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, శంకరరావు, ఈశ్వరరావు, రామారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు నందిని



నందినిని అభినందిస్తున్న పెరుమాళి హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తెర్లాం: మండలంలోని పెరుమాళి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎలకల నందిని రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నందినిని అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో నందిని మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా నుంచి ఎంపికైంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో నందిని మంచి యోగా ప్రదర్శనలు ఇచ్చి బాగా రాణించాలని, పాఠశాలకు, తనకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండల పరిధి కొట్టిశ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాప్రమాణాలపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు, బి.లక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన ఇసుక లారీ

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్సై ఇ. శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేపడుతుండగా.. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రాజాంలో మరో ట్రాక్టర్..

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని సీతారామ థియేటర్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పట్టుకున్నారు. నాగావళి నది నుంచి రాజాం ప్రాంతానికి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ఎంతో ప్రతిష్టాత్మకం

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఆరోగ్యకార్యదర్శుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాజాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇళ్లకు పరిమితమైన వారికి కూడా వైద్యసేవలు అందించాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో హెల్త్ మ్యాపింగ్ జరుగుతుందన్నారు. దీనివల్ల ఆరోగ్య ఆంధ్ర సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే శిబిరానికి వచ్చే వారందరికీ టోకెన్లు ఇవ్వడంలో విఫలం కావడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, కరణం హరిబాబు, అనూష, రాజు మాస్టారు, ఓలేటి గణపతి, లక్ష్మణరావు, తోట తిరుమలరావు, పాలవలస శ్యామ్, శాసపు వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వరప్రసాద్



వరప్రసాద్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం వరప్రసాద్, తదితరులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి లాలాక్షి వరప్రసాద్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల యోగా టీచర్స్ రాంబాబు, వినోద్ తెలిపారు. పార్వతీపురం ఆర్‌సీఎం పాఠశాలలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో అండర్ 17 విభాగంలో ప్రతిభ సాధించాడని, తూర్పుగోదావరి జిల్లా వీరవాసరం పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ సాధించిన వరప్రసాద్‌ను పాఠశాల హెచ్‌ఎం జీవీ.వరప్రసాద్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు వి. అప్పలనాయుడు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ సాధించాలని ఆకాంక్షించారు.

ఆగూరులో ఇంటింట సర్వే



జగనన్న సురక్ష టోకెన్లు అందిస్తున్న సర్పంచ్, తదితరులు

రాజాం: మండలంలోని ఆగూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి గురువారం ఇంటింట సర్వే చేపట్టారు. పంచాయతీ సర్పంచ్ కోనారి అప్పారావు, పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావులతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు సురక్ష వైద్య శిబిరానికి రావల్సిన వారికి టోకెన్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడాపరికరాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద గురువారం క్రీడా పరికరాల పంపిణీ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు, హెచ్‌ఎంలకు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన పరికరాలను జిల్లా క్రీడా విభాగం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేటితో ఈకేవైసీ గడువు పూర్తి

సంతకవిటి: ఈ క్రాప్ ఈకేవైసీకి శుక్రవారంతో గడువు పూర్తవుతుందని మండల వ్యవసాయాధికారి పైల నవీన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ క్రాప్‌లో నమోదు కావడం వల్ల ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు కోల్పోతే ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరవుతుందన్నారు. ఇప్పటివరకు మండలంలో 13,249 మంది రైతులకు గాను 19,153 ఎకరాలకు ఈక్రాప్ నమోదు చేశామన్నారు. ఇందులో 18,546 ఎకరాలకు సంబంధించి 12,335 మంది రైతులు ఈకేవైసీ పూర్తిచేశారని, మిగిలిన రైతులు శుక్రవారంలోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



సోపేరులో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని సోపేరు, పాగిరి గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో విద్యుత్ స్తంభాలను మారుస్తున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఓజేసీఏ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్డులోని సీతారామ థియేటర్ నుంచి జోలపేట, మారుతీనగర్, పొనుగుటివలస ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలను అప్‌లోడ్ చేయండి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ:

పంచాయతీలలో చేపట్టిన సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలను ఈ–గ్రామస్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు మండల స్థాయి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనకు తీసుకున్న అంశాలను ఈ–గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదుచేయాలని సూచించారు. అందరికీ ఉపాధి, ఆహారభద్రత, ఆరోగ్యం, విపత్తుల నుంచి రక్షణ, సామాజిక ఆర్థిక సమస్యలకు ప్రజలు గురికాకుండా చూడడం, నిస్సహాయులకు ప్రాథమిక సేవలు అందించడం, మౌలిక సౌకర్యాలు, సహజ వనరులను వినియోగించుకోవడం, ఆర్థిక సేవలు అందుబాటులో ఉండేలా చూడడం, సామాజిక సంరక్షణ, సామాజిక భద్రత, తదితర వివరాలు ఈ నెల 13లోగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.